క్లుప్తంగా

దేవాంగ సంఘం ఆధ్వర్యంలో ఏక్కాహం



భజన చేస్తున్న భక్తులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం దేవాంగ సంఘం ఆధ్వర్యంలో ఏక్కాహం నిర్వహించారు. సంఘం సభ్యుడు పొలాస శేఖర్ మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన శ్రావణమాసాన్ని పురస్కరించుకొని వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని, రైతులు క్షేమంగా ఉండాలని ఏక్కాహం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బెనికి శ్యాంసుందర్, పూజారి గురుదత్తు, భజనపరులు రాజమౌళి, గోరంట్ల చంద్రమౌళి, బెగుడ చంద్రమౌళి, కేదారి, బాపు, సత్తయ్య, కొండయ్య, శంకర్, సత్తయ్య, శివయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

31న పద్మశాలీ సామూహిక యజ్ఞోపవిత ధారణ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఓల్డ్ కాలనీలో గల శ్రీ ఉమా మహేశ్వర మార్కండేయ ఆలయంలో ఈనెల 31న సామూహిక యజ్ఞోపవిత ధారణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పద్మశాలీ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి వెంకటేష్, కొంగ సంపత్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు పద్మశాలీ కుల బాంధవుల సామూహిక యజ్ఞోపవీత ధారణతో పాటు సామూహిక రక్షబంధన్ వేడుకలు ఉంటాయన్నారు.

తాత్కాలిక రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సంతోష్

దహెగాం: కాగజ్‌నగర్ –దహెగాం మండలాల మధ్యలోని అందవెల్లి పెద్దవాగుపై నిర్మిస్తున్న తాత్కాలిక రోడ్డు పనులను సోమవారం మండల రైతుబంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్ పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభ సమయంలో రోడ్డు కొట్టుకుపోగా ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వాగులో తాత్కాలిక రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. వారంలోగా పనులు పూర్తవుతాయని సంతోష్‌గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'మహాధర్నా' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీఎస్ నాయకులు

కెరమెరి: యూఎస్‌పీసీ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాటసమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో నిర్వహించే మహాధర్నా పోస్టర్‌ను సోమవారం మండలంలోని సాకడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో డీటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మడపచి అర్జున్, ఉపాధ్యక్షుడు రామారావు, కార్యదర్శులు కర్ను, విశ్వేశ్వరరావు, నైతం నారాయణ, శ్యాంరావు, సీఆర్‌టీలు రాజేశ్, రంజిత్, ఉత్తమ్, సూర్యప్రకాశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

'తొలిమెట్టు' పకడ్బందీగా నిర్వహించాలి

కెరమెరి: తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని ఖైరీ, ఆగర్‌వాడ, కెలిబి పాఠశాలలను ఆయన సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. బయోమెట్రిక్‌లో తప్పనిసరిగా హాజరు వేయాలన్నారు. ఖైరీలో అగ్గిపుల్లలతో తయారు చేసిన ఆకృతులను గురించి విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు.

నూతన కాలనీ అభివృద్ధికి కృషి

కాగజ్‌నగర్‌టౌన్: నూతన కాలనీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తామని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. కాగజ్‌నగర్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సమీపంలో ఏర్పడ్డ వాసవి కాలనీ పేరు బోర్డును సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మాంగ్ కులపత్రం జారీ చేయాలని వినతి

ఆసిఫాబాద్: మాంగ్ కుల పత్రం జారీ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మొహలే దత్త సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మరాఠీ భాష మాట్లాడే తెలంగాణ షెడ్యూల్ కులాల్లో పేర్కొన్న మాంగ్ కులస్తులకు ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ కార్యాలయాల ద్వారా జారీ చేయాలన్నారు.

ఆటలు ఆడేదెలా..?

- అనువుగా లేని క్రీడా ప్రాంగణాలు
- నిరుపయోగంగా మారిన వైనం
- జిల్లాకు 878 క్రీడా కిట్లు పంపిణీ
- నేడు జాతీయ క్రీడాదినోత్సవం



బోదంపల్లిలోని క్రీడా ప్రాంగణంలో బురద

కౌటాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు చాలా చోట్ల అధ్వానంగా మారాయి. పల్లెల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని అధికారులు పనులు ప్రారంభించారు. ఒక్కో మైదానానికి రూ.4 లక్షల నుంచి రూ. 5లక్షలు వెచ్చించారు. ఎకరం విస్తీర్ణంలో ఉండే వీటిలో ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ ఆటలు ఆడే విధంగా స్థలాన్ని రూపొందించారు. క్రీడా ప్రాంగణంలో స్థలాన్ని బట్టి చుట్టూ 200 నుంచి 300 మొక్కలు నాటాల్సి ఉంది. ఇందుకు ఉపాధిహామీ నుంచి రూ.55 వేల వరకు ఖర్చు చేసుకోవచ్చు. భూమి చదును, మట్టి వేయించడం, మొక్కలు నాటడం.. ఇలా అన్ని పనులకు రూ.2లక్షలకు పైగా ఖర్చుకు అవకాశం కల్పించారు. కానీ చాలాచోట్ల పనులు అంతంత మాత్రంగానే చేపట్టారు. కాగా నేడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

క్రీడలకు అనుకూలమేనా..

క్రీడలను ప్రోత్సహించేందుకు గ్రామాలతో పాటు మున్సిపాలిటీల్లోని ప్రధాన వార్డుల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రీడాకారులకు అందుబాటులో ఎకరం విస్తీర్ణంతో కూడిన అనువైన స్థలం గుర్తించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సౌకర్యాల కల్పనకు ఉపాధిహామీ కింద నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా 1,102 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 902 చోట్ల స్థలాలను గుర్తించారు. మిగిలిన 200 క్రీడా ప్రాంగణాలకు స్థలాలను గుర్తించాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 878 క్రీడా ప్రాంగణాలు క్రీడలకు అనుకూలంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆడేదెక్కడా..?

క్రీడా ప్రాంగణాల కోసం ప్రభుత్వం జిల్లాకు 878 క్రీడా యూనిట్లను ఇటీవల పంపిణీ చేసింది. క్రీడా పరికరాలు ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. త్వరలో వీటిని ఆయా పంచాయతీలకు పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఒక్కో క్రీడా కిట్టులో క్రికెట్, వాలీబాల్ కిట్లు, టీ షర్టులు, మూడు జతల డంబల్స్ వంటివి ఉన్నాయి. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుకు దాదాపు అన్నిచోట్ల సరైన స్థలం లేకపోవడంతో పాఠశాలల మైదానాల్లోనే ఏర్పాటు చేశారు. మరికొన్ని గ్రామాల్లో సరిగా చదును చేయకపోవడంతో రాళ్లు, రప్పలతో ఆడలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. అనేక చోట్ల చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. దీంతో ప్రభుత్వం క్రీడా పరికరాలు అందించినా, ఆడేందుకు అనువైన స్థలాలు లేవని యువకులు వాపోతున్నారు. పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడంతో క్రీడలకు యువత దూరంగా ఉంటున్నారు.

ఎమ్మెల్యే కోనప్పకు సన్మానం



ఎమ్మెల్యే కోనప్పతో యువకులు, నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: బీఆర్‌ఎస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పేరు ప్రకటించడంతో వివిధ సంఘాల నాయకులు , యువకులు ఆయనను ఘనంగా సన్మానించారు. సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోనప్పను పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. అరెగుడా -మోసం గ్రామానికి చెందిన పలువురు యువకులు తొలి ఓటు నమోదు చేసుకొని ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి మద్దతు తెలిపారు. అనంతరం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు సమక్షంలో పార్టీలో చేరారు. కాపువాడతో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు కోనప్పను సన్మానించారు. మాలీలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కట్టుబడి ఉండడంతో కోనప్ప వెంటే ఉంటామని మాలీ సంఘం నాయకులు పేర్కొన్నారు.

'ఎన్‌హెచ్‌ఎం' ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: నేషనల్ హెల్త్‌మిషన్ స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా, అంబేదద్కర్ చౌక్‌వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణుకు తన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు సదానందం, వెంకటేష్, హరీష్, స్రవంతి, కాశిమల, విజయ, సంగీత, అరుణ, లక్ష్మి, అరుణ, నిధియా పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు వేతనం పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కెరమెరి: ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేలు వేతనం అందించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సేవంతకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన అన్ని పనులు చేస్తున్నా వీరిని గుర్తించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆశాలు అరుణ, సావిత్ర, పద్మబాయి, కన్నిబాయి, కళావతి, రంభాబాయి తదితరులు ఉన్నారు.

దహెగాం: గిరిజన ప్రాంతాల్లో 32 ఏళ్లుగా, మైదాన ప్రాంతంలో 18 సంవత్సరాలుగా పని చేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల ఆశా కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ బక్కయ్యకు వినతిపత్రం అందజేశారు. గండె శోభ, రజిత, సత్యమ్మ, జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సంఘం మండల అధ్యక్షురాలు శ్రీలత డిమాండ్ చేశారు. సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారి నేహకు అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఆశాలు లక్ష్మి, రమ్య, పద్మ, అనసూర్య, సరోజన, భూదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్: రైతులు ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. సోమవారం మండలంలోని ఇదులవాడ గ్రామంలో ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను పర్యవేక్షించి విద్యార్థుల కు మెనూ ప్రకారం భోజనం అందించాలని పేర్కొన్నారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, సర్పంచ్ భీమేశ్, నాయకులు పాల్గొన్నారు.

వారసంతలో అన్నదానం

కౌటాల: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో సోమవారం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రతీ సోమవారం వారసంతకు వచ్చే ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బాపన్న, అనిల్, సుధాకర్, మల్లేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్: మెడికల్ కళాశాలలో స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జాతీయ నాయకుడు సుందరి మాట్లాడుతూ మండలంలోని అంకుసాపూర్ గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలలో అటెండర్, వాచ్‌మెన్ పోస్టులను స్థానికులకే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రేణుక, తారాబాయి, గౌతమి తదితరులు ఉన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం బాలాజీ అన్నదాన సొసైటీ ఆధ్వర్యంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమాల్లో అన్నదాన సొసైటీ సభ్యులు గోలెం తిరుపతి, కిరణ్‌కుమార్, గంగాపూర్ సర్పంచ్ పందిర్ల వినోద తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

జైనూర్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, సత్వరమే పీఆర్‌సీ, ఐఆర్‌ను అమలు చేయాలని సంఘం నాయకుడు కనక వెంకటేశ్ అన్నారు. సోమవారం మండలంలోని మార్లవాయి ఆశ్రమ పాఠశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించే మహాధర్నా విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఆరె సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

సిర్పూర్(టి): ఆరె కుల సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆరె కుల సంఘం మండల అధ్యక్షుడు చెన్నపురి శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి) ఆరె కుల సంఘాన్ని రద్దు చేయాలని కొందరు కులస్తులు పేర్కొనడాన్ని ఖండిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా కొందరు కుల సంఘం నాయకులు చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. నాయకులు ఎలుములే శంకర్, శ్యాంరావ్, చౌదరి మడుగు, బోయ రమేశ్, ఎల్ములే రమేశ్, కిశోర్, ధర్మారావు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న 104 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సంఘం నాయకుడు మహేందర్ డిమాండ్ చేశారు. అత్యవసర సమయాల్లో సేవలందిస్తున్న 104 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మల్లేశ్, ప్రశాంత్‌గౌడ్, రవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 2వ ఏఎన్‌ఎంలతో పాటు వివిధ రకాల ఏఎన్‌ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. 2వ ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మె సోమవారం 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. సత్యనారాయణ, ఉపేందర్, చిరంజీవి, శంకర్, వసంత, పుణ్యవతి, భాగ్య, రజిని, కమల, భూదేవి, ప్రమీల, సునీత, తిరుమల, మీనా, రాధ, పద్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

కౌటాల: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం అధికారులు కృష్ణప్రసాద్, స్మితాబేకర్ అన్నారు. కౌటాల మండలం బోదంపల్లి గ్రామంలోని పల్లె దవఖాన, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను సోమవారం పరిశీలించారు. రికార్డులు పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆసుపత్రితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ నవత, హెచ్‌ఈవో సోనాజీ, హెల్త్ సూపర్‌వైజర్ పావని, హరిసింగ్, హెచ్‌ఏ శైలేందర్, సీహెచ్‌వోలు ఫౌజియా, ప్రవళిక పాల్గొన్నారు.

బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో బీసీ చైతన్య యాత్రలో భాగంగా గ్రామస్తులకు బీసీ సంఘం బలోపేతంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, మారుతి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ రవి

సిర్పూర్(టి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిర్పూర్(టి) జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ పి.రవి అన్నారు. సోమవారం మండలంలోని వెంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టాలపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలు క్షణికావేశాలకు లోనై కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతూ తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ఇరువర్గాలు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తామని తెలిపారు. న్యాయవాదులు కిశోర్‌కుమార్, గణపతి, కల్యాణ్, సతీశ్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం



కోవ లక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు

కెరమెరి: జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని ఆసిఫాబాద్‌లోని తన స్వగృహంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్‌రావులు సోమవారం కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా కోవ లక్ష్మి పేరును సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో సన్మానించిటన్లు వారు పేర్కొన్నారు. చిన్నసాకడ, బాబేఝరి, కొలాంఝరి, మోడి, ఇందాపూర్, పెద్ద సాకడ, ఖైరీ గ్రామాలకు చెందిన మహిళలు, నాయకులు మడావి రఘునాథ్, సుమిత్రబాయి, విజయలక్ష్మి, పెందోర్ శ్రీనావాస్, కుమురం లాల్‌శావ్, బుచ్చన్న, బాలాజి, భీంరావు తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఇన్‌స్పెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు



సుధాకర్‌ను సన్మానిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: ఇటీవల జిల్లా నుంచి రామగుండం కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లిన డీసీఆర్‌బీ సీఐ సుధాకర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సురేశ్‌కుమార్ శాలువాతో సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ సేవలను కొనియాడారు. డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, డీసీఆర్బీ డీఎస్పీ రమేశ్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ 15 ఏళ్లుగా సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సీఆర్పీలు, సీసీవోలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఎస్‌వోలు, ఏపీవోలకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు డీఈవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీరి ఆందోళనకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కోశాధికారి నగేశ్, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మాలల యుద్ధభేరి' జయప్రదం చేయాలి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

కాగజ్‌నగర్‌టౌన్: దళితుల ఐక్యత, రాజ్యాంగ రక్షణకు హైదరాబాద్‌లో అక్టోబర్ 8న నిర్వహించే మాలల యుద్ధభేరి సభను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద సోమవారం తెలంగాణ మాల మహానాడు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మాలలు రాజకీయ అణచివేతకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్ నుంచి ఎస్సీ వర్గీకరణ అంశం తొలగించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని మార్చి పాలకులు దళితులను రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పంబాల సతీష్, జైభీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సుధీర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'కేజీబీవీ'లో ఏం జరుగుతోంది..?

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ కేజీబీవీలో రెండు రోజులుగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళ్తే పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న స్వాతి అనే విద్యార్థిని పాఠశాలలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతుందని విద్యార్థినులు వాదిస్తున్నారు. పాఠశాలలో జరిగే విషయాలను ఇంటి వద్ద చెబుతుండడంతో ఉపాధ్యాయులు స్వాతిని ఒకసారి మందలించారు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం పాఠశాలలో మంచినీటి బోరు చెడిపోగా ట్యాంకులో నీళ్లు లేక విద్యార్థినులు ప్లేట్లను వర్షపు నీటి మడుగులో శుభ్రం చేసుకున్నారు. దీన్ని కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడంతో విషయం బయటకు రాగా విద్యార్థిని స్వాతి తల్లి ఉపాధ్యాయులను నిలదీసింది. పాఠశాల ప్రహరీ దూకి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన గుర్తు తెలియని వ్యక్తిపై ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే స్వాతి, ఆమె తల్లియే ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతున్నారని వారు పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థినులు అభ్యంతరం చెబుతున్నారు. సోమవారం డీఈవో అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఎంఈవో వెంకటేశ్వరస్వామి, జెడ్పీటీసీ సంతోష్‌లు పాఠశాల పరిస్థితులపై ఆరా తీశారు. మంగళవారం పూర్తిస్థాయిలో విచారణ జరిపి సమస్య పరిష్కరిస్తామని వారు విద్యార్థినులతో పేర్కొన్నారు.

ఆలయాల్లో పూజలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో సోమవారం శ్రావణ సందడి నెలకొంది. శ్రావణ సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని బాలేశ్వర మందిరంలో అర్చకులు చందావార్ బాలేశ్వర శర్మ, శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని శివకేశవ మందిరంలో అర్చకులు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో రాత్రి పార్థివ లింగపూజ నిర్వహించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

జైనూర్: దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, నాయకులు పాల్గొన్నారు.